# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-10-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2. శ్రీకాకుళం జిల్లా అరసవల్లి ఆలయాన్ని స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద అభివృద్ధి చేయనున్నట్లు కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

**3. గృహ నిర్మాణ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు.**

**4. రాష్ట్ర హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా ఐదుగురు జడ్జీలు ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.**

==========================

ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వైయస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్–అమరజీవి జలధార ప్రాజెక్టులను ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్‌తో కలిసి ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమృత్ నగర్ కూడలిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్‌ను ఇరువురు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర సహకారంతో రాష్ట్ర పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, వీధి దీపాలు, రహదారుల అనుసంధానం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలుపుతూ..

వాయిస్ ..25.. సెకన్లు

అంతకుముందు ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో 30 వేల 156 కోట్ల రూపాయలతో ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 4 వేల 500 కోట్ల రూపాయల విలువైన తాగునీటి పనులను పూర్తి చేసిందని పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

--------------------------

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు నుంచి రెండు రోజులు విశాఖపట్నంలో పర్యటిస్తారు. ఇందులో భాగంగా విశాఖ నేవల్ డాక్‌యార్డులో ఎన్-14ఏ జెట్టీలో ఈ సాయంత్రం జరిగే కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొని, నౌకాదళ సిబ్బందితో ముచ్చటించనున్నారు. అనంతరం అక్కడే నిర్వహించే బడాఖానాలో పాల్గొంటారు. రాత్రికి నేవల్ బేస్‌లోని చోళా సూట్స్‌లో బస చేయనున్నారు. రేపు ఉదయం హిందుస్థాన్ షిప్‌యార్డ్‌ను సందర్శించి స్లిప్‌వే-4ను ప్రారంభిస్తారు. అలాగే ఎఫ్ఎస్ఎస్-4 నౌకకు కీల్ లేయింగ్ కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు, ఎఫ్ఎస్ఎస్-1 నౌకకు ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం ఒడిశాకు బయలుదేరి వెళ్లనున్నారు.

--------------------------

శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయాన్ని స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద 55 కోట్ల 74 లక్షల రూపాయలతో రానున్న రెండేళ్లలో సమగ్రంగా అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. అరసవల్లి ఆలయాన్ని దర్శించుకున్న కేంద్ర మంత్రి ఈ0రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి ఆలయ అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. అనంతరం రామ్మోహన్ నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ ..30.. సెకన్లు

--------------------------

గృహ నిర్మాణ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకి చెందిన 21 మంది పేద, మధ్యతరగతి కుటుంబాల ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందించే 2 లక్షల 50 వేల రూపాయల రాయితీ మంజూరు పత్రాలను లబ్దిదారులకు మంత్రి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని అన్నారు.

--------------------------

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'ప్రజా సేవాతో దేశ సేవా' పేరుతో ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా 'భారత ఈశాన్య ప్రాంత అభివృద్ధి' గురించి ఈరోజు తెలుసుకుందాం.

దేశంలోని ఈశాన్య రాష్ట్రాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల పెంపు, శాంతి స్థాపన లక్ష్యంగా పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. పీఎం-డివైన్ పథకం కింద 2022-23 నుంచి 2025-26 వరకు 6 వేల 600 కోట్ల రూపాయలు కేటాయించింది. భారత్ నెట్ ద్వారా ఈశాన్య రాష్ట్రాల్లోని 6 వేల 355 గ్రామాలకు ఇంటర్నెట్ సేవలు విస్తరించాయి. కేంద్ర ప్రభుత్వ చర్యలతో ఈశాన్య ప్రాంత స్థూల ఆర్థిక వ్యవస్థ 2014-15లో 3.32 లక్షల కోట్ల నుంచి 2024-25 నాటికి 10.21 లక్షల కోట్ల రూపాయలకు పెరిగింది. ఈశాన్య ప్రాంత అభివృద్ధిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక సందర్భంలో మాట్లాడుతూ...

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

రాష్ట్ర హైకోర్టుకు ఐదుగురు అదనపు న్యాయమూర్తులు శాశ్వత న్యాయమూర్తులుగా ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. అమరావతిలోని హైకోర్టు సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ కె. మహేశ్వరరావు, జస్టిస్ టి.చంద్ర ధనశేఖర్, జస్టిస్ సి.హెచ్ గుణరంజన్, జస్టిస్ ఏ.హరిహరనాథ శర్మ, జస్టిస్ వై.లక్ష్మణరావులతో శాశ్వత న్యాయమూర్తులుగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ఐదుగురు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలపడంతో కేంద్ర న్యాయశాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేయడంతో ఐదుగురు శాశ్వత న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేశారు.

---------------------------

ఆసియా క్రీడలు 2026లో భాగంగా మహిళల కాంపౌండ్ ఆర్చరీ టీమ్ విభాగంలో చైనాపై విజయం సాధించి స్వర్ణ పతకం సాధించిన ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖకు గన్నవరం విమానాశ్రయంలో క్రీడా సంఘాల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి గన్నవరం చేరుకున్న జ్యోతి సురేఖ పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఆసియా క్రీడల్లో నాలుగుసార్లు స్వర్ణ పతకం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యమని జ్యోతి సురేఖ తెలియజేస్తూ...

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి, అంకుర సంస్థలు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించేలా కాకినాడలో 'స్కిల్స్, స్టార్టప్స్, భారత్ హబ్ – స్కిల్ సెంటర్' ఏర్పాటు కానుందని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు తెలిపారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న భారత్ హబ్ స్కిల్ సెంటర్‌కు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌తో కలిసి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు.

---------------------------

భారతీయ రిజర్వు బ్యాంక్ –ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీ మూడు రోజుల సమావేశం ఈరోజు నుంచి ప్రారంభమైంది. ఈ సమావేశంలో ద్రవ్య విధానంపై ఆర్బీఐ తాజా నిర్ణయం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే 125 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించిన ఆర్బీఐ.. వరుసగా నాలుగు ద్రవ్య విధాన సమావేశాల్లో రెపో రేటును 5.25 శాతం వద్ద కొనసాగించింది. ద్రవ్య విధాన కమిటీ తీసుకున్న నిర్ణయాలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఈ నెల 7వ తేదీన వెల్లడించనుంది.

=====================